# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 13 సంచిక:257 | కర్నూలు, 25-3-2026, బుధవారం | పేజీలు: 8 | వెల: 1.00


## ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

తుంగతుర్తి ముందస్తు అరెస్టులు ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలకు నిదర్శనమని,ప్రజల గొంతు నొక్కే ప్రయత్నమని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు తడకమళ్ళ రవికుమార్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో మండల కేంద్రంలోని నాయకులను పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేశారు.

## విద్యుత్ కొనుగోలు ధర యూనిట్ రూ.4కు తగ్గాలి: సీఎం చంద్రబాబు

విద్యుత్ శాఖ అధికారులతో సీఎం చంద్రబాబు నాయుడు మంగళవారం సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో జరిగిన ఈ సమీక్షలో పలు కీలక సూచనలు చేశారు సీఎం. విద్యుత్ కొనుగోలు ఛార్జీలను తగ్గించే అంశంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఆ దిశగా చేపడుతున్న చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టే విద్యుత్ కొనుగోలు ధరను యూనిట్‌కు రూ.4కు తగ్గించటం సహా ప్రజలపై భారం వేయకుండా విద్యుత్ సంస్థల రుణాలు తీర్చేందుకు కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సూచించారు.



రాష్ట్రంలో 2028-29 నాటికి విద్యుత్ కొనుగోళ్ల వ్యయాన్ని తగ్గించేందుకు చేపట్టిన ప్రణాళికలను విద్యుత్ శాఖ అధికారుల ముందుంచారు ముఖ్యమంత్రి. విద్యుత్ రంగంలోని వివిధ విభాగాలలో సంస్కరణలు చేస్తే.. మొత్తంగా యూనిట్‌కు రూ.1.32 చొప్పున విద్యుత్ కొనుగోలు భారాన్ని తగ్గించవచ్చని అధికారులు చంద్రబాబుకు వివరించారు. 2028-29 నాటికి యూనిట్ కొనుగోలు ధరను రూ.4.10కు తెచ్చేలా చర్యలు చేపట్టామని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ముఖ్యమంత్రి స్పందిస్తూ.. కొనుగోలు ధర రూ.4గా ఉండేలా తగ్గించాలన్నారు. నూతన టెక్నాలజీని, ఇన్నోవేషన్లను ఉపయోగించుకుని విద్యుత్ పొదుపు చర్యలు చేపట్టాలని అధికారులకు వివరించారు.

విద్యుత్ సంస్థలను సమర్థవంతంగా నిర్వహించడంతో 2025-26 ఆర్థిక ఏడాదికి సుమారు రూ.339 కోట్ల వరకు ఆదా చేశామని సీఎం అన్నారు. ఈ తరహా పొదుపు చర్యలను మరిన్ని చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్యుత్ సంస్థలకు పెను భారంగా మారిన అప్పులను తగ్గించి.. ఛార్జీలు పెంచకుండా అప్పులు తీర్చేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

## ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ అనుమతులు: ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

ఢిల్లీ: అనంతపురం జిల్లాలో పేద ప్రజలకు విద్య, వైద్యం వంటి సేవలు అందిస్తూ విశేష గుర్తింపు పొందిన రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ సంస్థకు ఎదురైన ఇబ్బందులపై టీడీపీ లోక్‌సభ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు స్పందించారు. కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ అనుమతుల్లో ఇబ్బందులు ఎదురయ్యాయని ఆయన తెలిపారు. అయితే, ఆర్డీటీ వంటి సేవా సంస్థ ఇబ్బందులు పడకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా కోరినట్లు ఆయన వెల్లడించారు. సీఎం ఢిల్లీ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు ఆర్డీటీ సంస్థ చేస్తున్న సేవలను వివరించినట్లు చెప్పారు.



టీడీపీ ఎంపీలు కూడా గత ఏడాది నుంచి కలిసి కేంద్ర హోంశాఖ అధికారులతో సంప్రదింపులు జరిపి, ఆర్డీటీకి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్య పరిష్కారం కావాలని కోరినట్లు లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. ఈ కృషి ఫలితంగా ఇప్పుడు ఆర్డీటీకి అవసరమైన ఎఫ్‌సీఆర్ఏ అనుమతులు లభించినట్లు తెలిపారు. ఇదే సమయంలో, ఈ అంశంపై వైసీపీ నేతలు పార్లమెంట్‌లో ఎప్పుడూ ప్రస్తావించలేదని ఆయన విమర్శించారు. సమస్యను ఎవరి దృష్టికి తీసుకెళ్లలేదని, ఇప్పుడు క్రెడిట్ కోసం మాట్లాడటం సరికాదని అన్నారు. ఆర్డీటీ సమస్య పరిష్కారంలో ఎవరు కృషి చేశారో ఆ సంస్థకు బాగా తెలుసని లావు శ్రీకృష్ణదేవరాయలు స్పష్టం చేశారు.

## వైసీపీ నేత పెద్దిరెడ్డికి సుప్రీంకోర్టులో దక్కని ఊరట

ఢిల్లీ: వైసీపీ నేత పెద్దిరెడ్డికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ





తగిలింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో తన కంపెనీకి పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని కోరుతూ ఆయన సతీమణి పేరిట దాఖలు చేసిన పిటిషన్‌ను, ఏపీ హైకోర్టులోనే పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది.

గత ప్రభుత్వ కాలంలో పి.ఎల్.ఆర్ కంపెనీ ద్వారా చేపట్టిన రోడ్డు పనులకు సంబంధించి బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, ఈ బిల్లులను వెంటనే చెల్లించేలా ఆదేశించాలని సుప్రీంకోర్టును పెద్దిరెడ్డి ఆశ్రయించారు. అయితే, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు నేరుగా జోక్యం చేసుకోవడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం, ఈ అంశంపై ముందుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది.

దీనిపై పెద్దిరెడ్డి తరఫు న్యాయవాదులు ఇప్పటికే ఏపీ హైకోర్టులో 12 కేసులు దాఖలు చేసినట్లు సుప్రీంకోర్టుకు వివరించారు. అయినప్పటికీ, హైకోర్టు పరిధిలోనే ఈ అంశం పరిష్కారం కావాలని ధర్మాసనం స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో, సుప్రీంకోర్టు సూచనల మేరకు పెద్దిరెడ్డి తరఫు న్యాయవాదులు తమ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో ఈ కేసు ప్రస్తుతం హైకోర్టులోనే కొనసాగనుంది.

## ఉత్తరాంధ్ర.. ఇకపై ఉక్కు ఆంధ్రా: సీఎం చంద్రబాబు

అమరావతి: కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ సహకారం వల్లే ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్‌ను రాష్ట్రానికి తీసుకురాగలిగామని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ ప్లాంట్ వల్ల లక్ష ఉద్యోగాలు వస్తాయని పునరుద్ఘాటించారు. మూడేళ్లలోనే అందరికీ అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. ‘ఉత్తరాంధ్ర.. ఇక నుంచి ఉక్కు ఆంధ్రా’ అంటూ ‘ఎక్స్’లో పోస్టు చేశారు.

“అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ వస్తున్నందున ఉత్తరాంధ్ర ప్రజలకు శుభాకాంక్షలు. ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్ ఉత్తరాంధ్రకు దిక్సూచి అవుతుంది. ఈ ప్రాంత ప్రజలకు మాట ఇచ్చాం.. మార్పు తెచ్చాం. ప్రతి రంగంలో, ప్రతి ప్రాంతంలో మార్పు తెచ్చి చూపిస్తున్నాం. ఉక్కు రంగంలో దేశంలో అత్యున్నత స్థానానికి ఏపీ చేరుతుంది’’ అని చంద్రబాబు పేర్కొన్నారు.



## క్రైస్తవంలోకి మారినవారు ఎస్సీ హక్కులు పొందలేరు: సుప్రీంకోర్టు

ఢిల్లీ: మతమార్పిడి అనంతరం అట్రాసిటీ చట్టం కింద కేసులపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. క్రైస్తవంలోకి



మారిన వారు ఎస్సీ హక్కులు పొందలేరని స్పష్టం చేసింది. హిందువులు, బౌద్ధులు, సిక్కులు మాత్రమే ఆ హక్కులు పొందుతారని పేర్కొంది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ చింతాడ ఆనంద్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టి.. నేడు తుది ఉత్తర్వులు జారీ చేసింది.

బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో పాస్టర్ చింతాడ ఆనంద్ ఎటువంటి అనుమతులు లేకుండా చర్చి నిర్వహించడంపై అక్కల రామిరెడ్డితో పాటు స్థానికులు అభ్యంతరం తెలిపారు. వారిపై అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఆనంద్ కేసు పెట్టారు. ఆ కేసును కొట్టివేయాలంటూ రామిరెడ్డి, స్థానికులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. చింతాడ ఆనంద్ పాస్టర్‌గా పనిచేస్తుండటంతో క్రైస్తవుడవుతారని.. రాజ్యాంగం ప్రకారం షెడ్యూలు కులాలకు సంబంధం ఉండదని రామిరెడ్డి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. పుట్టుకతో హిందువు అయినా.. క్రైస్తవం స్వీకరించడంతో ఆనంద్ షెడ్యూల్ కులానికి చెందరని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అట్రాసిటీ చట్టంలోని సెక్షన్లు ఆయనకు వర్తించవని, ఫిర్యాదు చట్ట వ్యతిరేకమని.. తమపై పెట్టిన కేసుకు విచారణార్హత లేదని వాదించారు. రామిరెడ్డి తరఫు న్యాయవాదుల వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. క్రైస్తవ మతంలో కులవ్యవస్థ లేదని పేర్కొంది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన వారికే ఎస్సీ హక్కులు పొందే అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆనంద్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ అంజరియా ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు తీర్పును సమర్థించింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోని వారు మాత్రమే ఎస్సీ హోదాకు అర్హులని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలా కాకుండా మతం మారితే ఎస్సీ హోదా రద్దవుతుందని తేల్చి చెప్పింది. క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని స్పష్టం చేసింది. పాస్టర్ ఆనంద్ దశాబ్దానికి పైగా క్రైస్తవంలో ఉన్నారని.. తిరిగి మారలేదని నిరూపణ అయిందని ధర్మాసనం పేర్కొంది.

## విజయవాడ ఉగ్ర లింకు కేసు.. నిందితులకు రిమాండ్

విజయవాడ: విజయవాడ ఉగ్ర లింకు కేసులో నిందితులు మహ్మద్ రెహ్మతుల్లా, మీర్జా సోహెల్, మహ్మద్ డానిష్‌లను విజయవాడ సీఎంఎం కోర్టులో హాజరుపరచగా.. న్యాయస్థానం ఏప్రిల్ 6 వరకు రిమాండ్ విధించింది. దీంతో వారిని విజయవాడ కేంద్ర కారాగారానికి తరలించారు. విచారణ సందర్భంగా.. న్యాయవాదిని నియమించుకున్నారా? అని నిందితులను న్యాయమూర్తి ప్రశ్నించగా.. తాము నియమించుకోలేమని తెలిపారు. ఈ విషయాన్ని రాతపూర్వకంగా కోర్టుకు ఇవ్వాలని న్యాయస్థానం పేర్కొంది.

పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లతో సంబంధాలు ఏర్పరచుకొని సామాజిక మాధ్యమాల ద్వారా ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడుతున్న ఈ ముగ్గురినీ విజయవాడ టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి.. వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ సహా పలు సామాజిక మాధ్యమాల ద్వారా యువతను ఉగ్రవాద భావజాలంవైపు ఆకర్షిస్తున్నట్లు గుర్తించారు.



ఉగ్రవాద రిక్రూట్‌మెంట్, జిహాదీ కార్యకలాపాల కోసం అవసరమైన నిధులను వీరికి పాకిస్థాన్ హ్యాండ్లర్లు సమకూరుస్తున్నట్లు నిఘావర్గాలకు సమాచారం ఉంది. ఏపీలోనే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువకులతో వీరు గ్రూప్‌లను ఏర్పాటు చేసి.. అందులో ఉగ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, వారు ఉగ్రదాడుల కోసం సన్నద్ధమయ్యేలా పురిగొల్పుతున్నట్లు విచారణలో తేలింది.

### చంద్రబాబుతో సంజయ్ దత్ భేటీ..

## ఏపీలో ఫిల్మ్ సిటీ, షూటింగ్‌లపై కీలక చర్చలు



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వేదికగా ఒక ఆసక్తికరమైన సన్నివేశం చోటుచేసుకుంది. బాలీవుడ్ దిగ్గజ నటుడు సంజయ్ దత్, తన బృందంతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. సచివాలయంలోని సీఎం ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశం జరిగింది. సంజయ్ దత్‌తో పాటు గౌరవ్ దూబే, కునాల్ పటేల్, అనుజ్ కుమార్ వంటి ప్రముఖులు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు, సంజయ్ దత్ కాసేపు ఏకాంతంగా కూడా మాట్లాడుకున్నారు. అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫిల్మ్ సిటీ నిర్మాణానికి ఉన్న అవకాశాలను సీఎం వివరించారు. విశాఖపట్నం లాంటి నగరాల్లో బాలీవుడ్ సినిమాల షూటింగ్‌లకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, సింగిల్ విండో క్లియరెన్స్ విధానంపై సీఎం క్లారిటీ ఇచ్చారు. ఏపీ ప్రభుత్వం సినిమా రంగానికి ఇచ్చే ప్రోత్సాహకాలను సంజయ్ దత్ బృందం ఆసక్తిగా అడిగి తెలుసుకుంది. కేవలం నటుడిగానే కాకుండా, చిత్ర నిర్మాణ రంగంలో కూడా అనుభవం ఉన్న సంజయ్ దత్ బృందాన్ని ఏపీలో స్టూడియోలు లేదా పోస్ట్ ప్రొడక్షన్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సీఎం ఆహ్వానించినట్లు సమాచారం.

### ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్..

## ఏప్రిల్ నుంచి మెగా 158 షూటింగ్!




మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు ఆసక్తికరమైన వార్త. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత చిరంజీవి, డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్ మరోసారి పునరావృతం కానుంది. మెగాస్టార్ కెరీర్‌లో 158వ చిత్రంగా రానున్న ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్ రెండో వారం నుంచి ప్రారంభం కానున్నట్టు తెలుస్తోంది. ఈ నెలాఖరులోగా సినిమాకు సంబంధించిన అధికారిక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి షెడ్యూల్‌లో చిరంజీవిపై కొన్ని సోలో ఎంట్రీ సన్నివేశాలను, ఆ వెంటనే ఓ మాస్ సాంగ్‌ను చిత్రీకరించాలని దర్శకుడు ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ, లోహిత్ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఇటీవల 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంతో విజయాన్ని అందుకున్న చిరంజీవిని ఈ సినిమాలో పూర్తిస్థాయి మాస్ అవతార్‌లో చూపించనున్నట్టు తెలుస్తోంది. అయితే కేవలం మాస్ అంశాలకే పరిమితం కాకుండా కుటుంబ భావోద్వేగాలకు కూడా పెద్దపీట వేస్తూ బాబీ ఓ ప్రత్యేకమైన కథను సిద్ధం చేశారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవిని సరికొత్తగా ప్రజెంట్ చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్నారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' భారీ విజయం సాధించడంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో, ఇండస్ట్రీలోనూ అంచనాలు రెట్టింపయ్యాయి. మాస్, ఎమోషన్ కలగలిపి రానున్న ఈ చిత్రం మెగాస్టార్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందేమో చూడాలి.


### విశాఖలో నటి శ్రుతి హాసన్ సందడి..

## ఆమెను చూసేందుకు ఎగబడ్డ ఫ్యాన్స్



విశాఖపట్నంలో నటి శ్రుతి హాసన్ సందడి చేశారు. ఓ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంను ఆమె ప్రారంభించారు. ఇక, తమ అభిమాన నటి షోరూం ప్రారంభోత్సవానికి రావడంతో ఆమెను చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. షోరూం ప్రారంభోత్సవం అనంతరం శ్రుతి హాసన్ అభిమానులతో సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో శ్రుతి హాసన్‌తో పాటు ఎమ్మెల్యేలు సి.హెచ్. వంశీ కృష్ణ, వి. రామకృష్ణ బాబు కూడా పాల్గొన్నారు.

# రణవీర్ సింగ్ విశ్వరూపం.. రికార్డులను తుడిచిపెడుతున్న 'ధురంధర్'




బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర ఆవిష్కృతమవుతోంది. యువ నటుడు రణవీర్ సింగ్ నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, రంజాన్ సెలవులను అందిపుచ్చుకుని కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 700 కోట్ల గ్రాస్ మార్కును అధిగమించి ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రావడంతో థియేటర్లు కిక్కిరిసిపోతున్నాయి. ముఖ్యంగా రణవీర్ సింగ్ నటన, ఆదిత్య ధర్ మేకింగ్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఆర్. మాధవన్, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ వంటి భారీ తారాగణం కూడా సినిమా స్థాయిని పెంచింది. ఈ చిత్రం సృష్టిస్తున్న ప్రభంజనం ముందు పాత రికార్డులు కొట్టుకుపోతున్నాయి. 'గదర్ 2', 'జైలర్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాల లైఫ్‌టైమ్ కలెక్షన్లను 'ధురంధర్' కేవలం నాలుగు రోజుల్లోనే దాటేయడం విశేషం. ఆదివారం ఒక్కరోజే భారత్‌లో రూ. 114 కోట్లు వసూలు చేయడం దీని జోరుకు నిదర్శనం. తాజా ట్రేడ్ నివేదికల ప్రకారం ఈ చిత్రం సోమవారం కూడా బాక్సాఫీస్ వద్ద తన పట్టు నిలుపుకుంది. సాక్‌నిల్క్ (Sacnilk) రిపోర్ట్ ప్రకారం పనిదినాల్లోనూ మంచి ఆక్యుపెన్సీతో నడుస్తుండటంతో, బుధవారానికల్లా రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా రణవీర్ సింగ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. ఇదే ఊపు కొనసాగితే, భారతీయ సినిమా చరిత్రలో టాప్ 5 చిత్రాల సరసన నిలవడం ఖాయమని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.

## సినిమా

## డార్లింగ్ రీ రిలీజ్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తన కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చిన సూపర్ హిట్ చిత్రం డార్లింగ్. ప్రస్తుతం ఈ చిత్రం మళ్లీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఒకప్పుడు ఆయనకు డార్లింగ్ అనే ట్యాగ్ తెచ్చిన ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్, ఇప్పుడు రీరిలీజ్ రూపంలో తిరిగి థియేటర్లలో సందడి చేయబోతోంది. ఈ సినిమా ఏప్రిల్ 23న గ్రాండ్‌గా మళ్లీ విడుదల కానుంది. 2010లో విడుదలైన ఈ చిత్రం అప్పట్లో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ముఖ్యంగా ప్రభాస్ నటన, స్టైలిష్ లుక్, కామెడీ టైమింగ్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సినిమా తర్వాతే ఆయనకు డార్లింగ్ అనే పేరుతో అభిమానుల్లో ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది.

## గ్లామర్ టచ్



ఒకప్పుడు టాలీవుడ్ స్టార్ హీరోయిన్‌గా వెలిగిన అందాల భామ రకుల్ ప్రీత్ సింగ్.. షార్ట్‌టైంలోనే తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. గ్లామర్ లుక్స్ తోపాటు.. నటనతో ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. అందం, అభినయంతో తెలుగు, తమిళ్, హిందీ అంటూ భాషతో సం బం ధం లేకుండా పాన్ ఇండియా హీరోయిన్‌గా పేరు దక్కించుకుంది. అయితే కెరీర్ మంచి ఫాంలో ఉన్నప్పుడే ప్రముఖ నటుడు, నిర్మాత జాకీ భగ్నానీని పెండ్లి చేసుకుని బాలీవుడ్ లోనే సెటిల్ అయిపోయింది. ఒకవైపు సినిమాలు చేస్తూనే మరొకవైపు సోషల్‌మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటోంది ఈ ముద్దుగుమ్మ. తాజాగా మరోసారి అందాలు ఆరబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. జీబ్రా అవుట్ ఫిట్ లో మెస్మరైజ్ చేసింది. వైట్ అండ్‌బ్లాక్‌చెక్స్‌డ్రెస్‌తో గ్లామర్ టచ్ ఇచ్చింది. రకుల్ షేర్‌చేసిన ఈ పిక్స్‌ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఇక ఇటీవలే హిందీలో 'దేదే ప్యార్‌దే 2'తో అలరించిన రకుల్.. లేటెస్టుగా 'మేరీ పత్నీ కా రీమేక్' ప్రాజెక్టులో బిజీగా ఉంది.

## సో స్పెషల్



'ది రాజా సాబ్' మూవీతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో గ్లామర్ షోతో ఫుల్ క్రేజ్ సంపాదించుకుంది. ప్రస్తుతం సర్దార్ 2 షూటింగులో బిజీగా ఉంది ఈ అమ్మడు. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే మాళవిక మోహన్ తరచుగా గ్లామరస్ ఫొటోస్‌షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తూ ఉంటుంది. తాజాగా ఓ ఈవెంట్‌లో ర్యాంప్‌వాక్‌తో అదరగొట్టింది. ఈసందర్భంగా మాళవిక ఇన్‌స్టా వేదికగా పిక్స్ లను ప్రేక్షకులతో పంచుకుంటూ ఇంట్రెస్టింగ్‌పోస్ట్‌చేసింది. 'నాకు ర్యాంప్‌వాక్ అంటే చాలా ఇష్టం. ఈ అద్భుతమైన లుక్‌ను రూపొందించిన నా టీమ్‌కు థాంక్స్. నటులుగా మనం క్యారెక్టర్‌లోకి ఒదిగిపోవడం, వేరేలా రెడీ కావడం అలవాటు. కానీ డైరెక్టుగా ఆడియన్స్ ముందుకు వెళ్లే ఆ అనుభూతి మాత్రం సో స్పెషల్. ముఖ్యంగా ఎంతో సరదాగా ఉంటుంది' అంటూ పేర్కొంది.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published & Printed at Sri Muktheswara Publications.,
D.No. 4-31-2, Balaji Nagar, Kurnool - 518006, Andhra Pradesh. Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com,APTEL/2013/50559, Editor: Kesaram Penta Reddy